ప్రజాశక్తి

సోమవారం 28 ఏప్రిల్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మేయర్ ఎన్నికకు రంగం సిద్ధం



టిడిపి అభ్యర్థిగా జాయింట్ కలెక్టర్‌కు బి.ఫారం అందిస్తున్న కోవెలమూడి రవీంద్ర.. పక్కన గళ్లా మాధవి దేగల ప్రభాకర్ తదితరులు



వైసిపి నుంచి అచ్చాల వెంకటరెడ్డికి బి.ఫారం అందిస్తున్న ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

- టిడిపి నుంచి రవీంద్ర, వైసిపి నుంచి వెంకటరెడ్డి పోటీ
- పార్టీ బి.ఫారాలను ఎన్నికల అధికారికి అందించిన నేతలు
- విప్‌లు జారీచేసిన టిడిపి, వైసిపి
- రెండు పార్టీల నుండి 14 మందికి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ పదవికి సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగనుంది. ఎన్నికల అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ వ్యవహరించనున్నారు. టిడిపి నుంచి 37వ డివిజన్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర (నాని), వైసిపి నుంచి 32వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు రెండు పార్టీ జిల్లా అధ్యక్షుల నుంచి బిఫారాలు ఎన్నికల అధికారి భార్గవ తేజకు అందించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి, పెమ్మసాని రవి, దేగల ప్రభాకర్‌తో కలిసి కోవెలమూడి రవీంద్ర టిడిపి మేయర్ అభ్యర్థిగా బి.ఫారాన్ని ఎన్నికల అధికారికి ఆదివారం ఉదయం అందించారు. వైసిపి నుంచి నలుగురు కార్పొరేటర్లు కలిసి పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు జారీ చేసిన బి.ఫారాన్ని జెసికి అందించారు. రెండు పార్టీల తరువున ఆయాపార్టీల కార్పొరేటర్లకు విప్‌లు జారీ చేస్తూ ▶ 2లో

ఏర్పాట్లు పరిశీలించిన జెసి

మేయర్ ఎన్నికకు సోమవారం జరగనున్న ప్రత్యేక సమావేశానికి సంబంధించి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ఆదేశించారు. మేయర్ ఎన్నిక జరిగే నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాట్లను జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ సెక్రెటరి బి.శ్రీనివాసరావు, డీఎస్పీ అజీజ్, లాలాపేట ఎస్‌హెచ్ఒ శివప్రసాద్‌లతో ఆదివారం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మేయర్ ఎన్నికను సోమవారం ఉదయం 11 గంటలకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఎన్నిక ప్రత్యేక సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10:30 గంటలకు తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని, సభ్యులు మినహా ఇతరులెవర్నీ సమావేశంలోనికి అనుమతించబోమని తెలిపారు. మొబైల్ ఫోన్‌లకు కూడా అనుమతి లేదన్నారు. ఎన్నికలు జరిగే జిఎంసి ప్రధాన కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటున్నందున ర్యాలీలు, గుంపుగా రావడానికి వీలులేదని, అందుకు తగిన విధంగా బారీ కేడింగ్, బందోబస్త్ చర్యలు జిఎంసి, పోలీసు అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.



యుటిఎఫ్ ప్రచురించిన బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డిఇఒ చంద్రకళ

అడ్మిషన్లు పెంపునకు యుటిఎఫ్ కృషి

బ్రోచర్ల ఆవిష్కరణలో పల్నాడు డిఇఒ ప్రత్యేక అభినందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు యుటిఎఫ్ కృషి అభినందనీయమని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, వసతులు, ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రతిభతోపాటు రాజ్యాంగ విలువలు, నైతిక విలువలు కాపాడుకుందాం అంటూ యుటిఎఫ్ ప్రచురించిన బ్రోచర్లను డిఇఒ తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను, అధికారులను ప్రశ్నిస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి, అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి 'ఎక్కడికో ఎందుకు దండగ ఫీజులు లేని ప్రభుత్వ బడి మన ఊరిలో ఉండగ' అంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం మంచి అంశమన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో పల్నాడు జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు మించి మంచి ఫలితాలు సాధించారని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 598 మార్కులు పల్నాడు జిల్లా నుండి నమోదు కావటం గర్వకారణమని అన్నారు. గతేడాది 18వ స్థానంలో ఉన్న పల్నాడు జిల్లా ఈ ఏడాది 11వ స్థానానికి చేరడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, డిఇఒ, ఎంఇఒలు, హెచ్‌ఎంలకు కృతజ్ఞతలతోపాటు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతను పెంచే బోధన, ప్రయోగాల ద్వారా బోధన, పోషకాహారం ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు, విద్యార్థి సమగ్ర వికాసంపై వ్యక్తిగత శ్రద్ధ, శారీరక వికాసం కోసం ▶ 2లో

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం

ముగ్గురు అరెస్టు, పరారీలో మరొకరు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో అల్లరి మూకలు చెలరేగిపోతున్నాయి. వారి ఆగడాలకు అడ్డుపడుతున్న కారణంగా ఏకంగా కానిస్టేబుల్‌ని అంతమొందించేదుకు దాడి చేశారు. విషయాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు నిందితులను అరెస్టు చేసిన తర్వాత బహిర్గతం చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు కాగా, మరొకరు పరారీలో ఉన్నారు. టూ టౌన్ సిఐ రాముల నాయక్ ఆదివారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై ఈ నెల 24న హత్యాయత్నం చేసిన చెంచుపేటకు చెందిన చేబ్రోలు జాన్ విక్టర్, మంగళగిరికి చెందిన షేక్ బాబూలాల్ అలియాస్ కరిముల్లా, ఐతానగర్‌కు చెందిన దోమ రాకేష్‌ను ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న రౌడీ షీటర్ వేము నవీన్ అలియాస్ కిల్లర్ పరారీలో ఉన్నాడు. ఐతానగర్‌లో ఉండే కానిస్టేబుల్ చిరంజీవి గతంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించాడు. జాన్ విక్టర్‌పై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ ఉంది. గంజాయి విక్రయం, దొంగతనం, కొట్లాట కేసులలో నిందితుడు. దోమ రాకేష్ కూడా చెడు వ్యసనాలకు బానిస. పలు కేసుల్లో నిందితుడు కూడా. కానిస్టేబుల్ చిరంజీవి గతంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సమయంలో జాన్ విక్టర్, దోమ రాకేష్‌ను గంజాయి సేవిస్తున్నారనే కారణంగా పలు దఫాలు స్టేషన్‌కు పిలిపించటం, కౌన్సిలింగ్ నిర్వహించడం వంటివి జరిగాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి పై కక్ష పెట్టుకున్న నిందితులు అతన్ని ▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న రాముల నాయక్.. వెనక ముసుగులో నిందితులు

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నష్టమే : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని, పల్నాడు జిల్లా

ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. ఉగ్రదాడులను నిరసిస్తూ మండల కేంద్రమైన పెదకాకానిలో ఆదివారం కొవ్వొత్తులతో సిపిఎం ప్రదర్శన చేపట్టింది. పాశం రామారావు మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రవాదుల చర్య అమానుషమని, అమాయ కులపై కాల్పులు హేయమని అన్నారు. నిఘా వర్గాలకు సమాచారం ఉన్నా కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం వల్లనే ఇలాంటి సంఘటన జరిగిందని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దేశానికి నష్టమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.శివాజి, ఎం.శ్రీనివాస్‌రాజా, రమేష్, బాబురావు, యు.శివయ్య, నాగేశ్వరరావు, మస్తానమ్మ, ఎస్‌కె.జానీబాష పాల్గొన్నారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల కేంద్రంలోని చెరువుకట్ట సెంటర్‌లో వామపక్షాలు, ముస్లిం యూత్, మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఉగ్రదాడుల్లో మృతులకు నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు మాట్లాడారు. డి.దిబ్బయ్య, మహమ్మద్ అస్లాం, షేక్ సుభానీ, బాజీ, మీరా హుస్సేన్ పాల్గొన్నారు.



పెదకాకాని నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న పాశం రామారావు



రొంపిచర్లలో కొవ్వొత్తులతో నిరసన

నేడు విట్‌కు చంద్రబాబు

ప్రజాశక్తి - తుళ్లూరు

సోమవారం రాజధాని అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. విశ్వవిద్యాలయంలో వి-లాంచ్ పాడ్ - 2025 (గ్లోబల్ ఇన్నోవేటర్స్ ఛాలెంజ్), మహాత్మా గాంధీ, వి వి గిరి,దుర్గాబాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాల ప్రారంభోత్సవం ఉదయం 10 గంటలకు జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రబాబు నాయుడు,కేంద్ర సమాచార,గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత,పర్యాటక, సంస్కృతి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్,ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మురళి టిఐఈ గ్లోబల్ అండ్ స్థాపకులు,సిఈఓ,వోల్క్స్ టెక్నాలజీస్ చైర్మన్ మురళి బుక్కపట్నం,ఐబిఎస్ గ్లోబల్, మార్కెటింగ్ డెవలప మెంట్ డైరెక్టర్ వరల్డ్ ఇన్వెన్షన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అసోసియేషన్స్(పోలాండ్) సీఈవో వోల్జిక్, చల్లా నాగ్ (హెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హైదరాబాద్) హాజరవుతారు.

అమృతరావుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాజీ శాసన సభ్యులు విశాఖ ఉక్కు ఉద్యమ నేత టి అమృతరావు 35వ వర్ధంతి సందర్భంగా ఆది వారం అమరావతి రోడ్డులని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళి అర్పి ంచారు. అమృతరావు విగ్రహానికి జాతీయ బిసి బహుజన ఫ్రంట్ తాటికొండ నరసింహారావు, బహుజన మహాసభ కేంద్ర కార్యదర్శి జి ఆర్ భగత్ సింగ్, దళిత బహుజన ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఘంటా ప్రభుదాసు విసికె పార్టీ మహిళా అధ్యక్షురాలు కే జయసుధ, చార్వాక యువజన సంఘం అధ్యక్షులు డేవిడ్ విలియమ్స్ , రజకజన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, భీమ్ సేన సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం ఆర్.పి.ఐ పార్టీ రాష్ట్ర నాయకులు విప్పర్ల ముత్తయ్య భీమ్ భారత్ మహిళా నాయకురాలు ఎన్ కమల కుమారి దళిత బహుజన సమితి రాష్ట్ర నాయకులు మంచాల జోసెఫ్ తదితరులు అమృతరావు విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం అమృతరావు చేసిన ఉద్యమాన్ని పలువురు కొనియాడారు. విశాఖ ఉక్కు కోసం ప్రాణ త్యాగం చేసిన మహానేత అమృతరావు అని నివాళి అర్పించారు.



విజేతలకు ట్రోఫీ అందజేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నల్లపాడు రైల్వే గ్రౌండ్స్‌లో పరుచూరి వీర రాఘవరావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో 16 రోజుల పాటు జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీను, బహుమతులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ టోర్నమెంట్ లో దాదాపు 70 టీమ్ లు పాల్గొన్నాయని, సాగర్ వారియర్స్ మొదటి స్థానం, జానీస్ బాయ్స్ ద్వితీయ స్థానం, లోకల్ బాయ్స్ తతీయ స్థానం సాధించిందని వీరందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. యువత క్రీడాలో రాణించాలని, క్రీడలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహిస్తున్నారని, క్రీడల వలన ప్రభుత్వ కొలువులో క్రీడాకారులకు కూడా తొలి ప్రాధాన్యత దొరుకుతుందని, ఇంత పెద్ద టోర్నమెంట్ నిర్వహించిన పరుచూరి సంజీవరావును అభినందిస్తున్నట్లు మాధవి తెలిపారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

అంతమొందించాలనుకున్నారు. ఇందుకు ఐతానగర్‌కు చెందిన రౌడీ షీటర్ వేము నవీన్ అలియాస్ కిల్లర్ సహాయం కోరారు. ఈనెల 24న జాన్‌విక్టర్, దోమ రాకేష్‌ను ఐతానగర్ రావాల్సిందిగా వేము నవీన్ కోరాడు. వారిద్దరూ కరిముల్లాను వెంటబెట్టుకొని ఐతానగర్ చేరారు. నలుగురు కలిసి మద్యం సేవించి, కానిస్టేబుల్ విధి నిర్వహణకు వెళ్లే సమయంలో అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఐతానగర్ అంబేద్కర్ విగ్రహం రోడ్డులో చిరంజీవి వస్తాడనే విషయం తెలుసుకున్న నలుగురు రాత్రి 9.30 గంటల సమయంలో అక్కడ మాటు వేశారు. బైక్‌పై వెళుతున్న చిరంజీవిని అటకాయించి వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో కరిముల్లా, రాకేష్ ఇద్దరూ చిరంజీవిని గట్టిగా పట్టుకోగా, రౌడీషీటర్ నవీన్ దాడి చేశాడు. జాన్ విక్టర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో చిరంజీవిపై దాడి చేశాడు. పెనుగులాటలో వారి నుంచి తప్పించుకున్న చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, వారు లింగారావు సెంటర్‌లో ఉన్నట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. కాగా రౌడీ షీటర్ నవీన్ పరారయ్యాడు. నిందితుడు ఉపయోగించిన కత్తిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన...

కానిస్టేబుల్‌పై పాత నేరస్తులు, రౌడీషటర్ కలిసి దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినా, విషయాన్ని బయటకు పొక్కనీయ లేదు. అయితే ఘటనపై స్పందించిన ఎస్పీ సతీష్ కుమార్ శనివారం రాత్రి తెనాలి వచ్చారు. ఈ కేసులో డీఎస్పీ తో పాటు సిఐలతో సమీక్షించినట్లు సమాచారం. ఎట్టకేలకు నిందితులను ఆదివారం అరెస్టు చేసిన తర్వాత వివరాలను బయటకు వెల్లడించారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేసినందుకు ఎస్పీ అభినందించారని సిఐ చెప్పారు.

మేయర్ ఎన్నికకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ జారీ చేసిన పత్రాలను కూడా ఎన్నికల అధికారికి అందించారు.

కార్పొరేషన్‌లో విప్‌ల జారీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. మొత్తం 56 మంది కార్పొరేటర్లు ఉండగా టిడిపి నుంచి 9, జనసేన నుంచి ఇద్దరు గెలుపొందారు. అయితే గతేడాది కాలంలో వైసిపి నుంచి 18 మంది కార్పొరేటర్లు ఫిరాయించారు. 14 మంది టిడిపిలో చేరగా నలుగురు జనసేనలో చేరారు. దీంతో టిడిపి, జనసేన కూటమి బలం 29కి చేరింది. వైసిపి కార్పొరేటర్ల బలం 27గా ఉంది. ఈ నేపథ్యంలో వైసిపి మొత్తం 46 మందికి విప్ జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. టిడిపి మాత్రం తమ పార్టీ నుంచి గెలిచిన 9 మందితో పాటు పార్టీలో కొత్తగా చేరిన మరో 14 మందికి కూడా టిడిపి విప్ జారీ చేయడం గమనార్హం. దాదాపు 14 మంది కార్పొరేటర్లకు రెండు పార్టీల నుంచి విప్‌లు జారీ కావడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి జారీ చేసే విప్‌లను టిడిపిలో చేరిన వారు తీసుకునేందుకు సిద్ధం కాకపోవడంతో వారికి వాట్సాప్ ద్వారా విప్‌పత్రం పంపడం, వారి ఇంటికి అంటించడం తదుపరి ప్రక్రియలను వైసిపి చేపట్టింది.

ప్రస్తుత బలాబలాలు ప్రకారం టిడిపి కూటమి అభ్యర్థి కోవెలమూడికి 29 మంది కార్పొరేటర్లతోపాటు ముగ్గురు ఎమ్మెల్యేలు, గుంటూరు ఎంపితో కలిపి 33 ఓట్లు వచ్చే అవకాశం ఉంది. వైసిపి నుంచి 27 మంది కార్పొరేటర్లతోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలతో కలిపి 29 ఓట్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ వైసిపి నుంచి ఇంకా ఒకరిద్దరు టిడిపికి అనుకూలంగా ఓటు వేయడం, లేదా గైర్హాజరయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు. విప్ దిక్కరించిన వారిపై అనర్హత వేటు పడుతుందా? లేదా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

అడ్మిషన్లు పెంపునకు యుటిఎఫ్ కృషి

(మొదటి పేజీ తరువాయి)

వ్యాయామ విద్య, మానసిక వికాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, గ్రంథాలయం, డిజిటల్ తరగతి గదులు, ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, విజ్ఞాన మేళాలు, సైన్స్ ఎగ్జిబిషన్ల ద్వారా బాల మేధావులను తయారు చేయడం వంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిసిడిఒ డి.రేణుక, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎ.భాగ్యశ్రీదేవి, జిల్లా కార్యదర్శిలు కె.తిరుపతిస్వామి, టి.వెంకటేశ్వర్లు, ఎన్.సుందరరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శన చేశారు. మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే చర్యను తిప్పికొట్టాలని, మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు.

కీళ్లవాతంపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన సంస్థ ఆరోగ్య సభలో ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ

ప్రజాశక్తి -గుంటూరు

సాధారణంగా జాయింట్ పెయిన్స్ సమస్య వచ్చినప్పుడు ఆర్థోపెడిక్, న్యూరాలజీ వైద్యులను సంప్రదిస్తుంటారని వాటిల్లో రుమటాలజీకి సంబంధించిన సమస్య గుర్తించనియెడల కాలయాపన జరిగి వ్యాధి తీవ్రత పెరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారని రుమటాలజిస్ట్ డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ తెలిపారు. అవగాహన సంస్థ కార్యాలయంలో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో కీళ్లవాతం మరియు జాయింట్ పెయిన్స్ సమస్య పై జరిగిన ఆరోగ్య సభలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాయింట్ పెయింట్స్ సమస్య అనిపించినప్పుడు సాధ్యమైనంత త్వరగా రుమటాలజిస్టును సంప్రదించిన ఎడల మంచిదని సూచించారు. పెద్దవాళ్లలో ముఖ్యంగా మెడ నొప్పి, నడుమునొప్పి, మోకాళ్ళ అరుగుదల, ఫ్రోజెన్ షోల్డర్స్ , కీళ్లవాతం లాంటి సమస్యలను చూస్తుంటామని. ఫ్రోజన్ షోల్డర్స్ సమస్య గురించి మాట్లాడుతూ మెడ భాగంలో డిస్కులు అరుగుదల వల్ల గాని, కండరాలు దెబ్బ తినడం వల్ల గాని, షుగర్ వ్యాధి అదుపులో లేని సందర్భాలలో గాని, కీళ్లవాతం సమస్య ఉన్న సందర్భాల్లో గాని ఫ్రోజన్ షోల్డర్స్ సమస్య తలెత్తుతుందని తెలిపారు. ఈ సందర్భాలలో వెంటనే డాక్టర్ ను సంప్రదించడం మంచిదన్నారు. నడుమునొప్పి గురించి మాట్లాడుతూ వెన్నుపూస భాగంలోని డిస్కులు అరగటం వల్ల , ఊబకాయం వల్ల , పని ఒత్తిడి ఎక్కువైనా , వయసు రీత్యా గాని సమస్య వస్తుందని తెలిపారు. మోకాళ్ళ అరుగుదల గురించి తెలుపుతూ మోకాళ్ళలోనే కార్టిలేజ్ పొర దెబ్బ తినడం వల్ల ఈ సమస్య వస్తుందని. సాధారణంగా వయసు రీత్యా, ఊబకాయం, మోకాళ్ళపై భారం పడే విధంగా వృత్తులలో ఉన్నవారికి ఈ మోకాళ్ళ సమస్య వస్తుందని, మొదటి రెండు దశలలో మందుల ద్వారా మరియు వివిధ రకముల ఇంజక్షన్ల ద్వారా తగ్గించవచ్చునని తెలిపారు. కానీ అడ్వాన్సుడ్ దశకు ఈ వ్యాధి చేరితే శస్త్ర చికిత్స చేయవలసి వస్తుందని తెలిపారు. కీళ్లవాతం గురించి తెలియజేస్తూ సాధారణంగా విశ్రాంతి స్థితిలో ఉన్నప్పుడు నొప్పి బాగా అనిపిస్తుంటే ఆ సమస్యను కీళ్లవాతం గా పరిగణించవలసి వస్తుందని, ఈ సమస్యతో బాధపడేవారు ఉదయం లేచిన వెంటనే జాయింట్స్ పట్టివేయటం లాంటి పరిస్థితిని కలిగి ఉంటారని తెలిపారు. కీళ్లవాతం సమస్య వచ్చినప్పుడు చేతివేళ్ల మోచేతులు ,మోకాళ్లు, మోకాళ్ళ వెనుక భాగం, మణికట్టు, గిలకలు ,పాదాలు లాంటి జాయింట్స్ వద్ద నొప్పి మరియు వాపు వస్తుందని, ఇలాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే రుమటాలజిస్ట్ ను సంప్రదించాలని తెలిపారు. కీళ్లవాతం వచ్చిన వారిలో వేళ్ళు వంకర పోవడం లాంటి పరిస్థితిని గమనిస్తుంటామని తెలియజేశారు. అంతేకాకుండా కీళ్లవాతం సమస్య ఉన్న వారిలో నోటిలో పుండ్లు, చిగుళ్లలో మరియు దంతాలలో సమస్య, జుట్టు పల్చబడటం ,కళ్ళు పొడిబారటం, బరువు తగ్గటం, శరీరం వేడిగా అవటం, నీరసం, చెమట పోయటం, విరోచనం సరిగా అవ్వకపోవడం, ఒకొకసారి నీళ్ళ విరోచనాలు అవ్వటం, యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం లాంటివి కూడా జరుగుతాయని తెలిపారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనగా కీళ్లవాతం ఉన్నవారు బంగాళదుంప, చిలకడ దుంప , శనగపిండి, మాంసాహారం, పులుపు వస్తువులు, పప్పు లాంటి ఆహార పదార్థాలు తీసుకోరాదని అన్నారు . ఈ కీళ్లవాతం సమస్య ఎక్కువగా ఆడవారిలో వస్తుందని ఈ సమస్య వచ్చినప్పుడు వారిలో హార్మోనల్ సమస్య తలెత్తి ఒక్కొక్కసారి ప్రెగ్నెన్సీ సమస్యలు కూడా వస్తాయని తెలిపారు. కీళ్లవాతం సమస్య ఎక్కువగా చలికాలం వర్షాకాలంలో బాగా ఇబ్బంది కలగ చేస్తుందని ఈ సమస్యతో బాధపడేవారిలో నడకలో తేడా మరియు కూర్చొని లేచే సందర్భాలలో కూడా ఇబ్బంది ఎదుర్కోవటం జరుగుతుందని తెలిపారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ



మంగళగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - మంగళగిరి

పహల్గంలో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ రూరల్ స్కేటింగ్ గుంటూరు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్కేటర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ అసోసియేషన్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సిహెచ్ సాంబశివరావు, కే విక్రం బాబు, గోపి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధితులకు నివాళులర్పిస్తూ ఆదివారం రాత్రి ఎన్‌సిసి, రైల్వే, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు పేరేడ్ గ్రౌండ్స్ నుంచి రైల్వే స్టేషన్ వరకు కొవ్వొత్తుల మార్చ్ నిర్వహించించారు. ఈ దాడిని ర్యాలీలో పాల్గొన్న వారంతా ఖండించారు.ర్యాలీలో కింది రైల్వే అధికారులు ఆర్‌పిఎఫ్, రైల్వే సిబ్బంది, స్కౌట్స్ మరియు గైడ్స్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ లో డిఆర్‌ఎం సుదేష్ణ సేన్, ఎడిఆర్‌ఎం కె.సైమన్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రైల్వే డిఆర్‌ఎం సుదేష్ణ సేన్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పహల్గాంలో భారతీయులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో ఆదివారం పిడుగురాళ్ల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో ముస్లిం లు భారీ ర్యాలీ చేపట్టారు.పెద్ద మసీదు నుండి ఐలాండ్ సెంటర్ మీదుగా ఎమ్మార్వో ఆఫీసు వరకు మత సామరస్యాన్ని కాపాడాలని నల్ల చట్టాలను రద్దు చేయాలని హిందూ ముస్లిం సిక్ ఈసాయి భాయ్ భాయ్ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఫ్తీ మౌలానా మహమ్మద్ మాట్లాడుతూ పహల్గాం లో జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో

మైనారిటీ నాయకులు అమీర్ అలీ, ఆలె హదీస్ బాధ్యులు షాన్వాజ్ ,బీసీ నాయకుడు దూదేకుల ఖాసీం సైదా, ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు ముజీబ్,ఆరిఫ్ మాట్లాడుతూ పహల్గాం లో జరిగిన దాడిని కొంత మంది తమ స్వార్ధ రాజకీయాల కోసం హిందూ ముస్లిం ఐక్యత దెబ్బ కొట్టి రాజకీయ లబ్ధి పొందాలని ముస్లిం లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అటువంటి వాటిని తిప్పి కొట్టాలని వారి ట్రాప్ లో పడొద్దని కోరారు. దేశ ప్రజలకు ఏదైనా సమస్య వస్తే సహాయం చేయడానికి ముందు వరసలో ముస్లిం లు ఉంటారని, కరోనా లాంటి విపత్తులు వచ్చినపుడు దేశ వ్యాప్తంగా ముస్లిం లు ఎలా సహాయం చేశారో గుర్తు తెచ్చుకోవాలని, అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు.కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా సవరణల పేరుతో నల్ల చట్టాలను చేస్తుందని వాటిని రద్దు చేసే వరకు రాజ్యాంగ బద్ధంగా పోరాడుతాము అని అన్నారు.ఈ ర్యాలీ లో తబ్లిక్ అమీర్ స్టీల్ ఖాసీం, కౌన్సిలర్ అబ్దుల్లా, ఖాదర్ వలి, అబ్దుల్ రజాక్, బాబా వలి, పొందుగల గని, జునైద్ భాష, మున్నా, భాష, మోటర్ మస్తాన్ వలి, గోల్డ్ షరీఫ్ , తాజుద్దీన్, సయ్యద్ రఫీ, అబ్దుల్ గని, జమాల్, జానీ భాష తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో..


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల ఎస్‌జివిఆర్ హై స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం వృత్తి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇప్పుడు మళ్లీ చదువులమ్మ ఒడి చేరి అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. రోజంతా సందడి చేశారు. పేరేచర్ల ఎస్‌జివి ఆర్ హైస్కూల్ 2003- 04లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ కలిసి ఉత్సాహంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువుల కోటేశ్వరరావు, కొండవీటి రాజేంద్ర ప్రసాద్, కొడాలి లావణ్య, బైరపనేని లక్ష్మీ సునీత, ఇందిరా దేవి. శ్రీనివాసరావు. నాగేశ్వరరావు. రమాదేవి. శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా గాజుల చెన్నయ్య

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్థానిక సిపిఐ కొమెరా వీరాస్వామి భవన్ లో ఆదివారం జరిగిన పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో గాజుల చెన్నయ్య సమీప ప్రత్యర్థి ఎస్‌ఎండిబాషపై 28 ఓట్ల మెజా రిటీతో విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారులు విష్ణు మునకల అప్పారావు, పగడాల సుధాకర్, మిద్దెపోగు బాబు రావు తెలిపారు. గాజుల చెన్నయ్యను సిపిఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అభినందించారు. చెన్నయ్య మాట్లాడుతూ కార్మికులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


దుర్మరణం చెందిన జకరయ్య

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్ ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి అక్కడక్కడ దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని పాలడుగు అడ్డ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. గుంటూరు నల్లకుంటకు చెందిన తమ్మిశెట్టి జకరయ్య (45) సత్తెనపల్లి నుంచి గుంటూరు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో జకరయ్య దుర్మరణం చెందాడు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సంఘటన విష యం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థానం చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాడవాడలా అరుణ పతాకాన్ని ఆవిష్కరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రపంచ కార్మిక పర్వదినం మేడే రోజున వాడవాడలా అరుణ పతాకాలను ఆవిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం పెదకాకానిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను, చట్టాలను కాలురాస్తున్నాయని కార్మికులకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకరించాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందని, భారత రాజ్యాంగంలో పొందు పరిచిన రిజర్వేషన్లకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు వచ్చాయని ఈ విధానాలను ప్రజలందరితో ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న మేడేను వాడవాడల జరపాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి నాన్నపనేని శివాజీ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని స్కీం వర్కర్స్ కు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరపాలని కోరారు పెదకాకాని మండలంలో ప్రభుత్వ భూములను నివాస ఉంటున్న పేద వర్గాలకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, వివిధ రకాల పెన్షన్ ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం శ్రీనివాస్ రాజా రమేష్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలం సిఐటియు కమిటీ సమావేశం ఆదివారం షేక్. మీర అధ్యక్షతన ఈ సందర్భంగా సిఐటియు మండల ఆధ్యక్షలు యస్ యమ్ బాషా మాట్లడుతూ మే1 వతేది ప్రపంచ కార్మికదినోత్సవం నిర్వహణపై విధి విధానాలు సూచించారు. వందేళ్ల కిందట 18, 14గంటలు పని చేసే విధానాన్ని రద్దు కోసమై పోరాడి కార్మికులు ప్రాణ త్యాగములు చేసి 8 గంటలు పని విధానిన్న సాధించుకున్న రోజు మే డే అని గుర్తు చేశారు. ఈసందర్బంగా ఐదు ప్రాంతాలలో కార్మిక జెండాలు ఎగురవేయుటకు నిర్ణయించారు. సిపిఎం నాయకులు రామకృష్ణ మాట్లడుతూ మేడేను ఆత్యంత దీక్షతో జరపాలి అన్నారు. ప్రస్తుత కార్మికుల పని దినాల వ్యవస్థలో 8గంటల పని చేసే విధానమును రద్దు చేసి 10, 12 గంటలు కార్మికులు పని చేయాలని కార్పోరేటు సంస్దలు కోరుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ వారి కార్పోరేటు మిత్రులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆందులో భాగంగానే సుమారు 1500 రోజుల నుండి విశాఖఉక్కు పరిశ్రమ కార్మికులు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా దీక్షలు చేస్తూన్నా, రాష్ట్ర ప్రభుత్వంగాని, గతములో ఉన్న జగన్ ప్రభుత్వంగాని, కార్మికులు చేసే పోరాటానికి మద్దతు ప్రకటించలేదు అన్నారు. రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధరలకు చట్టము చెయ్యాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయ్యాలని, లేబరుకోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్లతో మే 20వ తేదిన చేపట్టే భారత్ హర్తహాళ్ జయ ప్రదం చేయాలని, సిఐటియు మండల కమిటీ బలపరిచినది. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు, అశావర్కర్లు, పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అధ్యక్షులుగా శేషు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల ఆర్యవైశ్య అధ్యక్షులుగా కోట వెంకట శేషరావు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ మండలంలో ఆర్యవైస్యుల సమస్యల పరిష్కరానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం నాయకులందరిని కలుపుకొని సంఘం అభ్యున్నతికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షులు వెలుగూరి లక్ష్మణరావు, ఎన్నికల అధికారులుగా ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి వనమా వేణుగోపాలరావు గారు రిటర్నింగ్ ఆఫీసర్‌గా కట్టమూరు అప్పారావు వ్యవహరించారు. ఫిరంగిపురం మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా కోట వెంకట శేషారావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల శివ నాగ శ్రీనివాసరావు ఉపాధ్యక్షులుగా మారం సాంబ శివరావు కార్యదర్శిగా తెల్లాకుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

పేద బ్రాహ్మణులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి


కోనూరి సతీష్ శర్మ దంపతులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేద బ్రాహ్మణులను ఆదుకుంటామని, వారికి ప్రభుత్వ పథకాలను అందేలా చూస్తామని ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా కోనూరు సతీష్ శర్మ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికమయిన సందర్బంగా ఆదివారం గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజీలో ఆయనకు అభినందన సభ జరిగింది. సభకు ఆల్ ఇండియా బ్రాహ్మిన్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు వి.పాండురంగవిఠల్ అధ్యక్షత వహించారు. సభకు మాజీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు చందు సాంబశివరావు టిడిపి పార్టీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, పాటిబండ్ల విజయ్, ప్రముఖ వైద్యులు శ్రీకంటి. రఘు మాట్లాడుతూ సతీష్ శర్మ గత 25 సంవత్సరాలుగా అకుంఠిత దీక్షతో బ్రాహ్మణ సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సభలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షులు శంకరమంచి.లలిత శాస్త్రి,ప్రధాన కార్యదర్శి మాచిరాజు మురళీకష్ణ,ఉపాధ్యక్షులు తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొని సతీష్ శర్మను గజమాలతో సత్కరించారు. తొలుత ఉగ్రదాడిలో ఇటీవల ప్రాణాలు కోల్పోయిన 26 మందికి సభ సంతాపం తెలియచేసింది.

నేటి నుండి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి- తాడేపల్లి

శాఖా గ్రంధాలయం తాడేపల్లిలో ఈనెల 28 వ తారీఖు నుండి జూన్ నెల 6 వరకు తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్కే నాగూర్బాష తెలిపారు. క్యాంపులో పిల్లలకు పుస్తకం చదివించటం, చదివింది రాయించటం, సాంస్కృతిక కార్యక్రమాలు స్పోకెన్ ఇంగ్లీష్, అల్లికలు వంటి వాటిపై రీసోర్స్ పర్సన్ చేత నేర్పించడం జరుగుతుందని చెప్పారు. వేసవిలో పిల్లలు గ్రంథాలయా నికి వచ్చి విజ్ఞానం పొందవలసిందిగా కోరారు. సమ్మర్ క్యాంపులో రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాష తెలిపారు.

పొలాల్లో మహిళ మృతదేహం

ప్రజాశక్తి - వెల్దుర్తి


మృతురాలు లక్ష్మి (ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని కొత్త పుల్లారెడ్డి గూడెం గ్రామం పొలాలలో ఆదివారం సగం కాలి ఉన్న మహిళ మృత దేహాన్ని గ్రామస్తులు చూసి విషయాన్ని వెల్దుర్తి ఎస్ఐ సమందరవలికి తెలియజేశారు. ఎస్ఐ సమందర్ వలీ తన సిబ్బందితో సంఘ టనా స్థలాన్ని చేరుకొని విచారించారు. సగం కాలి ఉన్న మృత దేహం లక్ష్మిగా పోలీసులు గుర్తించారు. ఆమె వయసు 65 సంవ త్సరాలు ఉండవచ్చు అన్నారు. ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సమంధర్ వలి తెలిపారు. అయితే మృతురాలు మాచర్ల పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి వెనుక వీధిలో నివసిస్తున్నట్లు తెలిసింది. శనివారం సాయంత్రం నుంచి లక్ష్మి కనిపించకుండా పోయిందని బంధువులు తెలిపారు. మృతురాలు లక్ష్మీ స్వగ్రామం గుండ్లపాడు గ్రామం. లక్ష్మి స్వగ్రామానికి వెళ్లకుండా కొత్త పుల్లారెడ్డి గూడెం గ్రామంలో మృతి చెందడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాలిన గాయాలతో ఉన్న లక్ష్మీ మృతదేహాన్ని చూసి బంధువులు, కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. లక్ష్మికి భర్త శంకర్రావు, ముగ్గురు కూతుళ్ల, ఒక కుమారుడు ఉన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరు హైస్కూల్ లో 2004-05 పదో తరగతి బ్యాచ్ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ ఒకచోటకు చేరి గతస్మృతులను స్మరించుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహకారం అందజేస్తామన్నారు. సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్‌గా ఉన్న పూర్వ విద్యార్థి కె శ్రీనివాస రావు హైస్కూల్‌లో పదవ తరగతిలో 501 మార్కులు సాధించిన ఎం.లక్ష్మీ పూజితను ఇంటర్ ఆపై తరగతులు ఉచితంగా చదివిస్తామని తెలపటంతో మిత్ర బృందం, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామ తులసి, ఉపాధ్యాయులు ఎ వీరాంజనేయులు, శ్రీనివాసరాజు,పినాకిని, పూర్వ విద్యార్థులు లీలా ప్రసన్న, బక్కా శ్రీను (అలియాస్ స్టాలిన్), వీర బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

డోకిపర్రులో దారుణ హత్య

ప్రజాశక్తి - మేడికొండూరు


హత్యకు గురైన వ్యక్తి

మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని డోకిపర్రు శివారు మామిడి తోటలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బండ రాయితో మొహం మీద అత్యంత కిరాతకంగా కొట్టి చంపారు. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది వివరాలు తెలియ రాలేదు. ముఖం రక్తంతో నిండి ఉండటం గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హత్యకు గల కారణాలను సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తుని వివరాలు తెలిసినవారు మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. దేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి శవగారానికి తరలించారు.

హక్కుల కోసం మేడే స్ఫూర్తితో ఉద్యమాలు

- ఉగ్రదాడుల నివారణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్రోద్యమ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను మేడే స్ఫూర్తితో కాపాడుకుందామని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నరసరావుపేట మండల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాసేలా ఉన్నాయని, వాటిని సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబరు కోడ్లు అమలు చేయడం ద్వారా కార్మిక చట్టాలు, హక్కులు బలహీన పడతాయని, శ్రమ దోపిడీ జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులను లాభం చేకూర్చడానికే లేబరు కోడ్లను తెచ్చారని విమర్శించారు. రానున్న రోజుల్లో కార్మికులు 8 గంటల పని విధానం నుండి 12 గంటల వరకు పనిచేయాల్సిన పరిస్థితి రానుందన్నారు. ఈ మార్పులకు వ్యతిరేకంగా 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

ఉప సభాపతిపై సిఎం చర్యలు తీసుకోవాలి

కార్మిక , కర్షక, పీడిత వర్గ ప్రజల కోసం పోరాటం చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని విజయకుమార్ డిమాండ్ చేశారు. ఉప సభాపతి స్థానానికి రఘురామకృష్ణంరాజు అనర్హుడన్నారు. బ్యాంకులు నుండి రూ.600 కోట్లకు పైగా రుణాలు పొంది ఎగ్గొట్టిన ఆర్థిక ఉగ్రవాది అని దుయ్యబట్టారు. ఆయనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి చర్యలు తీసుకోవాలని, పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఉగ్ర దాడి

జమ్ము కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్ల జరిగినట్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని విజయకుమార్ అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి కాశ్మీర్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కాశ్మీర్ ప్రజలంతా ఉగ్రవాదుల దాడులకు నిరసనగా బంద్ ప్రకటించి, పాటించడం మంచి పరిణామమన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఆసరాగా చేసుకొని దేశంలో మత విద్వేషాలను సృష్టించి ప్రజల మధ్య విభజన తెచ్చే కుటిల రాజకీయ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా విజయకుమార్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు, నాయకులు డి.శివకుమారి, కెపిజె మెటిల్డాదేవి, వి.నాగమ్మ భాయ్, సయ్యద్ రబ్బాని, షేక్.సిలార్ మసూద్, టి.పెద్దిరాజు, కట్టా కోటేశ్వరరావు, బి.సలీం, సుభాష్ చంద్రబోస్, కె.రామారావు, షేక్ మస్తాన్‌వలి, కె.నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

రేపు నరసరావుపేటకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నరసరావుపేటకు మంగళవారం వస్తారని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం అవలంబించాల్సిన వైఖరి, చేపట్టనున్న పోరాటాలతోపాటు ఇటీవల తమిళనాడులో జరిగిన సిపిఎం అఖిల భారత మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలపై వివరిస్తారని తెలిపారు.



దీక్షా శిబిరంలో మోకరిల్లి

39వ రోజుకు పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 39వ రోజుకు చేరాయి. తమ మొర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆలకించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శిబిరంలోనే కార్మికులు మోకరిల్లి ప్రార్థనలు చేశారు.



230 మందికి ఉచితంగా వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట (సామాజిక సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. సీనియర్ డాక్టర్ లింగమల్లు మోహన్ భాస్కర్, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ 230 మందికి పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులను అందించారు. వాలంటీర్లకు సీనియర్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాసట సభ్యులు నూతలపాటి కాళిదాసు, సామినేని శ్రీనివాసరావు, గోనుగుంట్ల కిరణ్, ముత్తవరపు రవీంద్రబాబు, కోయ రామోజీరావు, కేతా రామబ్రహ్మం, ముత్తవరపు కృష్ణమూర్తి, బచ్చు రాజేష్ కుమార్, ముత్తవరపు వేణుగోపాల్, రావి సురేష్‌బాబు, చిట్టిపోతు రంగారావు, రావూరి సురేష్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పక్కనే జంతువుల వ్యర్థాలతో దుర్గంధం

ప్రజాశక్తి - మాచర్ల

మాంసం విక్రేతలు జంతువుల వ్యర్థాలను ప్రధాన రహదారి పక్కనే పడవేయటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు రోడ్డు చంద్రవంక బ్రిడ్జి వద్ద రహదారిపక్కనే జంతువుల వ్యర్థాలను పడవేస్తున్నారు. ఆ వ్యర్థాలను తినటానికి వచ్చిన కుక్కలు వాటిని రోడ్డుపైకి లాక్కొస్తున్నాయి. దాంతో రహదారి వెంట వచ్చేపోయే వారు దుర్గంధం భరించలేకపోతున్నారు. ఆ వ్యర్థాల్లో కొంత భాగం చంద్రవంక వాగులో పడుతుండడంతో నీరు కలుషితమై చెడు వాసన వస్తోంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, వందలమంది పాదచారుల రాకపోకలు జరుగుతుంటాయి. ఈ ఒక్క ప్రాంతమే కాకుండా జమ్మలమడక, మండాదిరోడ్డు, సాగర్‌రోడ్డ పక్కనే ఇటువంటి జంతువుల వ్యర్థాలను పారవేస్తున్నారు. తీవ్రమైన దుర్వాసన వలన ఆయా రోడ్ల వెంట వెళ్లాలంటే ముక్కుమూసుకొని పోవాల్సి వస్తుంది. దీనిపై అధికారులు సత్వరం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



వాలీబాల్ విజేతగా రామకృష్ణాపురం కెవి జట్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



హైదరాబాద్ 54వ రీజియన్ స్థాయి అండర్-17 బాలుర వాలీబాల్ పోటీల్లో రాకృష్ణాపురం కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. మండలంలోని రామకృష్ణాపురం పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో రెండ్రోజులుగా జరుగుతున్న పోటీలు ఆదివారం ముగిశాయి. టోర్నీలో మొత్తం 18 జట్లు పాల్గొనగా ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీ ఫైనల్‌లో వాల్తేరు జట్టుపై రామకృష్ణాపురం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరగా రెండో సెమీఫైనల్‌లో ఖమ్మం జట్టుపై విజయవాడ-1 గెలిచింది. ఫైనల్లో రామకృష్ణాపురం, విజయవాడ-1 జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడగా హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజయం రామకృష్ణాపురం జట్టునే వరించింది. విజయవాడ-1 రన్నరప్‌గా నిలిచింది. మూడో స్థానం కోసం ఖమ్మం, వాల్తేరు జట్లు తలపడగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజయాన్ని వాల్తేరు జట్టు కైవసం చేసుకుని తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్‌ను ఏపీ ఫైర్ స్టేషన్ ట్రైనింగ్ సెంటర్ డిఎఫ్‌ఒ సత్యనారాయణ ప్రదానం చేశారు. ధ్రువపత్రాలను రామకృష్ణాపురం కేంద్రీయ విద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.కిరణ్‌రెడ్డి అందించారు.

నేటి నుండి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రంథాలయంలో పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరము నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. విద్యార్థులలో విజ్ఞానము పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం గ్రంథాలయాలలో విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కథలు చదివి వినిపించటం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్ పోటీలు నిర్వహించి వారిలో నైపుణ్యం పెంచేలా శిక్షణిచ్చి విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గంటా శ్రీనివాసరావు కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై 20న సార్వత్రిక సమ్మె

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20న చేసే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిఐటియు విస్తృత సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కార్మిక హక్కులు, సంఘాలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రోజురోజుకూ దాడులు పెంచుతోందని, ఫలితంగా కార్మికులు కనీస హక్కులనూ కోల్పోతున్నారని చెప్పారు. పని గంటలు పెంచడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం ఇందులో భాగమని అన్నారు. గతంలో ఒక సంస్థలో పనిచేసే కార్మికుడు అనుకోకుండా సెలవు పెడితే దాన్ని సెలవుగా గుర్తించి ఆ రోజు ఆ కార్మికునికి వచ్చే వేతనాన్ని లేదా జీతాన్ని ఇవ్వకుండా మిగిలిన పని దినాలకు జీతాన్ని ఇచ్చే వారిని, ఇప్పుడు మారిన చట్ట ప్రకారం జీతాన్ని ఇవ్వకపోగా ఆరోజు కంపెనీ ఉత్పత్తిలో ఆ కార్మికుడు ఉత్పత్తి చేసే ఉత్పత్తి సామర్థ్యం ఎంత ఉంటుందో ఆ వస్తువుకి సమానమైన నగదును నష్టపరిహారంగా జీతంలో మినహాయించేలా విధానాన్ని తెచ్చారని విమర్శించారు. కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పనిలో నుంచి తొలగించేటువంటి అధికారం కంపెనీలకు నూతన చట్టాల ద్వారా ఇచ్చారని తెలిపారు. అనేక రంగాల్లో పని చేస్తున్న అసంఘటితరంగా కార్మికులకు కూడా ఈ చట్టాల ద్వారా పెద్ద ఎత్తున నష్టం కలుగుతున్నట్లు తెలిపారు. కార్మికుల జీవితాలను అభద్రతలోకి, ఆర్థిక దుస్థితిలోకి నెట్టే ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా చేపట్టే సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు జి.విజయకుమార్, జి.మల్లేశ్వరి, ఎం.హరిపోతురాజు, టి.శ్రీనివాసరావు, షేక్ బందగి సాహెబ్, జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.





కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి,హెచ్.బాబురావు, తుళ్లూరులో రేకుల షెడ్లను పరిశీలిస్తున్న సి.హెచ్.బాబురావు, నేతాజీ తదితరులు

వలస కార్మికుల సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో వలస కార్మికుల సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దఅష్టి పెట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి. హెచ్. బాబురావు అన్నారు.ప్రధాని మోడీ మే2న రాజధాని అమరావతి పున:నిర్మాణ పనుల ప్రారంభానికి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రతినిధుల బృందం శనివారం రాజధాని గ్రామాల్లో పర్యటించింది.రాజధాని నిర్మాణం నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల నివాసాలు,సదుపాయాలను బఅందం సభ్యులు పరిశీలించారు.తుళ్లూరు, రాయపూడిలో నిర్మిస్తున్న ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ, ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణాల వద్దకు వెళ్లి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో కార్మికులు, శ్రామికులది కీలకపాత్రని,వారి భద్రత,సంక్షేమంకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నివ్వాలని అన్నారు.రాజధానికి ఒరిస్సా, బీహార్, అస్సాం, పశ్చిమబెంగాల్‌తో పాటు అనేక ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చారని,ఇంకా వేలల్లో వస్తారని ప్రభుత్వం చెబుతోందని బాబురావు అన్నారు. రాజధానిలో వలస కార్మికులకు సరైన సదుపాయాలు లేవని తమ పరిశీలనలో తేలిందని ఆయన చెప్పారు.పశువుల కొట్టాల మాదిరిగా ఉన్న రేకుల షెడ్లలో కార్మికులు తలదాచుకుంటున్నారని అన్నారు.వేసవి కాలంలో రేకుల షెడ్లలో ఉంటున్నారని,దీంతో కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు.పిల్లలకు చదువులు లేవని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రెంటల్ హౌసింగ్ పథకం ద్వారా రాజధానిలో వలస కార్మికులకు తాత్కాలిక పక్కా ఇళ్లను నిర్మించాలని అన్నారు.ఇళ్ల అద్దెను కాంట్రాక్ట్ సంస్థల నుంచి వసూలు చేయాలన్నారు.కార్మికుల పిల్లలకు తాత్కాలిక పాఠశాలలను నెలకొల్పాలని అన్నారు.నిర్మాణ సంస్థల నుంచి ఒక శాతం సెస్సు వసూలు చేసి కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.వలస కార్మికులందరి పేర్లు నమోదు చేసి ప్రతి ఒక్కరికీ ప్రమాద భీమా వర్తింప జేయాలన్నారు. రాజధానిలో ఇ ఎస్ ఐ ఆసుపత్రిని నిర్మించాలని అన్నారు. కార్మికశాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి రాజధానని చెబుతున్న ప్రభుత్వం కార్మికులకు కల్పించే సౌకర్యాల స్థాయి కూడా తగ్గకుండా ఉండేలా చూడాలన్నారు.రాజధానిలో కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సచివాలయ నిర్మాణం సమయంలో ప్రమాదం జరిగి కొంతమంది కార్మికులు చనిపోయారని,భవిష్యత్తులో అలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.కార్మికుల భద్రత,సంక్షేమం తదితర అంశాలపై సిఆర్‌డిఎ, ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థల యాజమాన్యాలతో,కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని బాబురావు కోరారు.కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ,రాజధాని డివిజన్ నాయకులు ఎం రవి,ఎం భాగ్యరాజు,జె నవీన్ ప్రకాష్,షేక్ జానీ, కుంభా ఆంజనేయులు పాల్గొన్నారు.



145 వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 145 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎం సాంబశివరావు, డి నాగేశ్వరరావు, బి సూర్యప్రకాశరావు, ఎన్ సుబ్బారావు, కె హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ, ఎం ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. న్యాయమైన కార్మికుల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ మైలేజీ పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టి.దుర్గాభవాని, ట.నాగేశ్వరరావు, వై.సాంబశివ రావు, వై.రమాదేవి, వై.యెహోషువ, భాషా, ఎస్.కె.ఇమాంబి, వై.సుబ్బారావు, ఎం.డి.ఇస్మాయిల్, ఎం.గురవయ్య, ఎం.శివకుమారి, బి.నవనీతం, ఎం.శారద, ఎ.విజయశ్రీ, ఎం.శరన్, ఆర్.ఇస్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు

ప్రజాశక్తి- తాడేపల్లి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20వ తేదీన సార్వత్రిక సమ్మెను తాడేపల్లిలో జయప్రదం చేయాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు నిర్ణయించాయి. ఆదివారం కేసి వర్క్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు వేముల దుర్గారావు, ఏఐటియుసిటి వెంకటయ్య, ఏఐఎఫ్టియు (న్యూ) ఆదినారాయణ, ఐ ఎన్ టి యు సి దర్శనపు సామేలు, ఐఎఫ్టియు ఎం చెన్నయ్య, వైయస్సార్ టి యు ఆర్ శ్రీనివాసరాజు ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పాల్గని మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాల రాస్తుందని విమర్శించారు. అందరూ భాగంగానే వినాశకరమైన నాలుగు లేబర్ కోడులు ను తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు . లేబర్ కోడ్లను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సమావేశం డిమాండ్ చేసింది. ఎనిమిది గంటల పని విధానం అమలు జరపాలని కోరింది. కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం 20000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 20 తేది జరుగును న్న జాతీయ సమ్మెలో తాడేపల్లి ప్రాంతంలో ఉన్న కార్మిక వర్గం మొత్తం పాల్గని జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లి పట్టణంలో మే మూడో తేదీ అందరూ కంపెనీ మేనేజర్లకు సమ్మె నోటీసు అందజేయాలని, 9వ తేదీ సదస్సు నిర్వహించాలని, 20వ తేదీ పట్టణంలో పెద్ద ఎత్తున కార్మిక ప్రదర్శన నిర్వహించాలని తీర్మానించారు.

ప్రముఖ సైంటిస్టు కృష్ణరాజేంద్రకు ఆత్మీయసత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరిలోని చింతక్రింది కనకయ్య ఉన్నత పాఠశాలలో 1982లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు... తమ బ్యాచ్ విద్యార్థి, ప్రముఖ సైంటిస్టు నీలి కృష్ణరాజేంద్ర అధునాతన మధ్యస్థ పోరాట విమానాలను రూపొందించడం, డిజైన్ చేయడం మరియు నిర్మించడంలో ఆయన సాధించిన అద్భుతమైన విజయానికిగాను స్వస్థలంలో అభినందన సత్కార కార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్రస్తుతం కృష్ణ రాజేంద్ర బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ (ఆర్అండ్ డీ), మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ లో ఏఎంసీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కఅష్ణ రాజేంద్ర తల్లిదండ్రులు నీలి గుణేశ్వరరావు, విజయకుమారి.. వీరు విశ్రాంత ఉపాధ్యాయులు. వీవర్స్ కాలనీలో నివాసం ఉంటారు. పూర్వవిద్యార్థుల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తాడికొండ తిరుమలరావు, రావెల శ్రీనివాసరావు, కె.సీతారామప్రసాద్, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసరావు, దామర్ల కుబేరస్వామి, వుడతా వెంకటేశ్వర్లు, వాల్మికి శ్రీనివాసరావు, దేవుళ్ల పుల్లయ్య, దామర్ల వీరాంజనేయులు, గంగాధరరెడ్డి, గోలి శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఆదివారం స్థానిక శ్రీ భద్రావతి సమేత భావనారుషిస్వామి కళ్యాణ మండపంలో నీలి కృష్ణరాజేంద్రకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ శాసనసభకమిటీ కార్యదర్శి కోనేరు సురేష్ బాబు, గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త బండ్ల మాధవరావు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీహరి రావును సత్కరిస్తున్న ఐఎంఏ బృందం

ఐఎంఏ ఆధ్వర్యంలో మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆదివారం ఐఎంఏ తెనాలి శాఖ, తక్కెళ్ళపాడు లోని కిమ్స్ చక్ర క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏపీ వైద్య మండలి మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ దగ్గు మాటి శ్రీహరిరావు పాల్గన్నారు. తొలుత ఇటీవల పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో మఅతి చెందిన వారికి నివాళులర్పించారు. తదుపరి డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ వంటి కార్యక్రమాలు ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కావూరి అనిల్ కుమార్, డాక్టర్ జి.మధు ప్రభాకర్ బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడారు. డాక్టర్ శ్రీహరిరావును ఐఎంఏ బృందం సత్కరించింది. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సుమన్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం





వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం


ప్రజాశక్తి- తాడేపల్లి

అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐకాన్ క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. అపార్ట్‌మెంట్‌లోని వివిధ విభాగాల్లో ఉన్న వారందరూ తొమ్మిది గంటలకి ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. తమ తమ రోగాలకు సంబంధించి ఏర్పాటు చేసిన వైద్య విభాగాలా వద్దకు వెళ్లి డాక్టర్ల ద్వారా వైద్య సహాయం అందుకున్నారు. విజయవాడ బందర్ రోడ్ స్రవంతి హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్ మరియు పెద్ద ఎత్తున వైద్య బఅందం, వైద్య సిబ్బంది రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యశాల అందించారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. 300 మంది ఈ వైద్య శిబిరం లో వైద్య సేవలు పొందారు. ఎముకలు, కీళ్లు మరియు వెన్నుపూస సమస్యలు, స్త్రీ ప్రసూతి, లాపారోస్కోపీ సేవలు, బిపి, షుగరు, థైరాయిడ్ మరియు జనరల్ వైద్య సేవలు, గుండె సమస్యలు, చిన్నపిల్లలకు సంబంధించిన వివిధ రకాల రోగాలకు సంబంధించి వైద్య శిబిరంలో రోగులు ఉచితంగా వైద్యం అందుకున్నారు. ఈసీజీ, ఏకో, కంటి శుక్లాల పరీక్షలు, రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్ష (బిఎండి) పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ ప్రెసిడెంట్ ఎం.వినోద్ కుమార్, సెక్రెటరీ ఎస్.కె.రియాజ్ భాషా, ట్రెజరర్ యు.రాజశేఖర్, విక్రమ్, ప్రకాష్, రమేష్, వి.స్వాములు, కె.లక్ష్మీ వెంకటరత్నం మరియు ఐకాన్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వేసవి విజ్ఞాన శిబిరం'

ప్రజాశక్తి - తుళ్లూరు

సోమవారం నుంచి స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం 'వేసవి విజ్ఞాన శిబిరం'ను నిర్వహిస్తున్నట్లు తుళ్లూరు శాఖ గ్రంథాలయాధికారి టి గిరిధర్ కుమార్ ఆదివారం తెలిపారు.గ్రంథాలయం పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు కథలు చదివి వినిపించడం జరుగుతుందని,దీంతో వారిలో వినగలిగే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్,పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్,పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జికె తదితర అంశాలను నేర్పించడం



గంగయ్య చౌదరి కుటుంబ సభ్యులతో జస్టిస్ గుణరంజన్

గంగయ్య చౌదరి కుటుంబాన్ని కలిసిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - యడ్లపాడు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఆదివారం యడ్లపాడు వచ్చారు. విశ్రాంత దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి ఇంటికి వెళ్లారు. గంగయ్య చౌదరి, భారతి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పలు విషయాలపై ముచ్చటించారు. కార్యక్రమంలో న్యాయవాది రమణకష్ణ నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ చెరుకూరి సృజన, పోపూరి వెంకటేశ్వర్లు (చిన్నా), రాఘవయ్య, వెంకట రత్తయ్య పాల్గొన్నారు.



మస్తాన్‌రావుకు నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు, నాయకులు

జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

మస్తాన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన జర్నలిస్టులు, నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

జర్నలిస్ట్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వినుకొండ నియోజకవర్గం జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ స్వర్గీయ ఉప్పు మస్తాన్‌రావు నాలుగో వర్ధంతి సభ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించారు. వినుకొండ జర్నలిస్టులు, నాయకులు, అభిమానులు మస్తాన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడి జర్నలిస్టు మస్తాన్‌రావు మృతి చెందారన్నారు. కరోనా బారిన పడి మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ జర్నలిస్టులు రాజవరపు ప్రకాష్‌రావు, లగడపాటి వెంకట్రావు, యార్లగడ్డ ఆజాద్, గంట కోటేశ్వరరావు, దేవిశెట్టి కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శ్రీను, నాయకులు పివి. సురేష్‌బాబు, ఆర్. శ్రీనివాసరావు, గంధం కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, మల్లెలప్రసాదు, సాయి బాబా, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

28 నుండి వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



క్రోసూరి వెంకటరావు

రొంపిచర్ల మండలం సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం నుండి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించ నున్నట్లు శాఖా ఇన్‌ఛార్జ్ గ్రంథా లయాధికారి క్రోసూరి వెంకట రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ శిబిరాలు జరుగుతాయని అన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలలలో విద్యార్థులకు పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్ప డం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్, జి.కె, ఇతర అంశాలను నేర్పిస్తారన్నారు. కార్య క్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలి

పల్నాడు జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్

ప్రజాశక్తి - మాచర్ల :

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని పల్నాడు జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం జరిగింది. వై.సురేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంజనేయ నాయక్ హాజరయ్యారు. జనరల్ బాడీ సమావేశాన్ని ఉద్దే శించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో బ్రిటిష్ కాలం నుంచి కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరో గ్యం, రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోక పోగా ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా కేంద్రం అమలు చేస్తుం దని దుయ్యబట్టారు. కార్మికులందరూ మేడే కార్యక్రమాల్లో



మాట్లాడుతున్న ఆంజనేయ నాయక్

పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్స్ పిలుపు మేరకు మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంజనేయనాయక్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండ్ల మహేష్,వేముల వెంకటరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు కొమర రమణ, పవర్ గ్రిడ్ నాయకులు వెంకటేశ్వర్లు, రామయ్య మున్సిపల్, పవర్ గ్రిడ్డు, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సిపిఎం చిలకలూరిపేట విస్తృత సమావేశం ఆదివారం పండరీపురం రెండవ లైన్‌లో గల కామ్రేడ్ ఏలూరి సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో పి.భారతి అధ్యక్షతన జరిగింది. ముందుగా కాశ్మీర్లో ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి మౌనం పాటించి జోహార్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారు. అనంతరం సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధ్యాయ రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 11 జాతీయ కార్మిక సంఘాలు మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా గ్రామీణ బంధును జయ ప్రదం చేయాలని 29 కార్మిక చట్టాన్ని రద్దుచేసి నాలుగు లేబర్ కోర్టును తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గాన్ని బానిసలు చేసే లేబర్ కోణంలో ప్రశ్న రద్దు చేయాలని వ్యవసాయ కార్మికులకు పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

హామీ పథకాన్ని అమలు చేయాలని, 200 రోజులు కనీసం రూ.600లుగా నిర్ణయించాలని, కౌలు రైతులకి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు ఎస్, లూథర్, ఎస్. బాబు రావు, పల్లెపగు రాజు. పి. శివ పార్వతి పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్త పోరాటాలు

రాష్ట్ర ఎస్టి కమిషన్ మాజీ సభ్యులు వడితే శంకర్‌నాయక్



సంఘీభావం తెలుపుతున్న గిరిజన నాయకులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేసేందుకు మాచర్ల నుండే శంఖారావం మోగిస్తున్నట్లు రాష్ట్ర ఎస్టి కమిషన్ మాజీ సభ్యులు వడితె శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక రింగురోడ్డు వైభవ్ రెసిడెన్సీలో ఉమ్మడి గుంటూరు జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు మూన్యావత్ రంగానాయక్ ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమావేశంలో శంకర్ నాయక్ మాట్లాడుతూ గతంలో గిరిజనులకు రిజర్వు అయిన వినుకొండ, మాచర్ల అసెంబ్లీ స్థానాలను రద్దుచేసి జనరల్ స్థానాలుగా చేసి గిరజనులు అభివృద్ధి నోచుకోకుండా చేశారన్నారు. 12 శాతం ఉన్న తమకు 10 శాతం రిజర్వేజన్ కల్పించాలన్నారు. తమకు న్యాయం చేయకుండా ప్రభుత్వం వడ్డెర, బోయ కులాలను ఎస్టీలో చేర్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని చెప్పారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి విజయవాడలో లక్షమందితో సభ నిర్వహించి గిరిజనుల సత్తా చాటుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి, ఎంపిటీసీ బ్రహ్మయ్య, సర్పంచులు కె.శ్రీను, ఆర్. మంత్రూనాయక్, సైదానాయక్, అంజినాయక్, బి.లచ్చునాయక్, రవి, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ ఎన్నిక లాంఛనప్రాయమే

నేడు వైస్‌చైర్మన్‌గా మదార్‌సాహెబ్ ఎన్నిక

ప్రజాశక్తి - మాచర్ల :

మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక లాంఛన ప్రాయమేనని తెలుగుదేశం పార్టీ వర్గాలు అంటున్నాయి. మాచర్ల పురపాలక సంఘానికి 31మంది కౌన్సిలర్లు వుండగా, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరుపున 31 వార్డులను ఆ పార్టీ అభ్యర్థులే ఎకగ్రీవంగా గెలుచుకున్నారు. దాంతో ప్రతిపక్ష పార్టీలకు ఒక్క కౌన్సిలర్ సీటు కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 17 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దాంతో వైస్‌చైర్మన్ ఎన్నికకు కావాల్సిన బలం చేకూరింది. అంతే కాకుండా మరి కొందరు కౌన్సిలర్లు పార్టీలో చేరంగానీ, ఎన్నిక సమయంలో మద్దతు తెలుపుతామని చెప్పి నట్లు టిడిపి వారు చెబుతున్నారు. వైసిపి తరుపున ఎవరూ పోటీకి దిగటం లేదని సమా చారం. దాంతో ఎన్నిక లాంఛన ప్రాయంగా జరగనుంది. టిడిపి నిర్ణయం మేరకు 27వ వార్డు కౌన్సిలర్‌గా వున్న షేక్ మదార్‌సాహెబ్‌ను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నుకోనున్నారు. ఆ తరువాత రెండు రోజులకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. పట్టణంలో సీనియర్ నాయకుడుగా వున్న మదార్ సాహెబ్‌కు పదవి రావటం పట్ల మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మదార్‌సాహెబ్

రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సేవలు : చీఫ్ విప్ జీవీ



కంటి వైద్య శిబిరంలో వైద్యులు

ప్రజాశక్తి - వినుకొండ

తమ కుటుంబ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శివశక్తి ఫౌండేషన్ ద్వారా రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తా మని, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి సేవా కార్యక్రమాలు విస్తరించాలని ప్రణాళిక రూపొందించారన్నారు. సెంటు భూమి, ఇల్లు లేని ఎస్టీలకు శివశక్తి ఫౌండేషన్ సేవలందిస్తుం దని అన్నారు. వినుకొండ గంగినేని కల్యాణ మండపంలో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్, పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరాన్ని ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు తమ ఫౌండేషన్ ద్వారా 40 వేలమందికిపైగా కంటి శుక్లాల శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. పేదరకంలో ఉండి ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్నత విద్య, సివిల్స్, గ్రూపు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కూడా శివ శక్తి ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం, ప్రోత్సాహకం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, పెమ్మసాని నాగేశ్వరరావు, పివి సురేష్ బాబు, గంగినేని రాఘవ, దాసరి కోటేశ్వరరావు, పాల్గొన్నారు శంకర కంటి ఆస్పత్రి వైద్యులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యులు, ఆర్.ఎం.పి డాక్టర్లు, అధికారులు, శివశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్మికునికి లస్సీ ప్యాకెట్ అందజేస్తున్న కమిషనర్ శ్రీహరిబాబు

సమాజహితం కోసం జర్నలిస్టుల కృషి అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేద ప్రజలకు సేవలు చేయడంలోనే నిజమైన సంతప్తి ఉంటుందని, వృత్తిపరంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ జర్నలిస్టులు సేవా కార్యక్రమాలుచేపట్టడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఒకటో డివిజన్‌లో కార్మికులకు లస్సీ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల సమస్యల్ని వెలికి తీసే బాధ్యత నిర్వహించడమే కాకుండా, సమాజ సంక్షేమం కోసం కూడా ముందడుగు వేస్తుండటం అభినందనీయమన్నారు. పారిశుధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, వేసవిలో వారి సేవలు గుర్తించి జర్నలిస్టు సంఘం స్పందించిందని వెల్లడించారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టులు సేవా కార్యక్రమాల్లో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడపా అశోక్, కార్యదర్శి షేక్ దరియావలి మాట్లాడుతూ వేసవి లో లస్సీ పాకెట్లు పంపిణీకార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ రమణ రావు,తోట మల్లికార్జునరావు,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కొచ్చర్ల చందు, జాయింట్ సెక్రెటరీ సుందర్ బాబు, కొండెపాటి రమేష్, పెనుమల మనోహర్, కొనికి సాంబశివరావు, అమ్మనబ్రోలు శివనారాయణ, రావిపాటి రాజా, నరసింహుల శ్రీకాంత్ శానిటేషన్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న రచ్చబండ సర్కిల్ ప్రతినిధులు

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

పదవ తరగతిలో 500 మార్కుల పైన వచ్చిన విద్యార్థులను మంగళగిరి రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం గాలి గోపురం సెంటర్లో ప్రోత్సహిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి ఉన్నత విద్య అభ్యసించి, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

అనాథ వృద్ధుడి ఆపరేషన్ సక్సెస్

ప్రజాశక్తి - తెనాలిరూరల్

తెనాలి జిల్లా వైద్యశాలలో 70 ఏళ్ల అనాథ బృద్ధుడికి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఏప్రిల్ 21న ఆసుపత్రిలో చేరిన వృద్ధుడిని పరీక్షించిన వైద్యులు ఎడమకాలు మడమ పైభాగంలో ఎముక విరిగిన్నట్లు గుర్తించారు. ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ హనుమంత రావు ఆధ్వర్యంలో వృద్ధుడికి ఏప్రిల్ 23న అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి ఆదివారం తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతంగా గిసిందన్నారు. వృద్ధుడు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ వార్డులో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. ఆదివారం వారి కార్యాలయంలో మాట్లాడుతూ వేట నిషేధ కాలంలో జీవనాధారం కోల్పోతున్న జాలర్ల కుటుంబాలకు.. ప్రభుత్వం రూ.20/- వేల చొప్పున సాయం చేయనుందని అన్నారు. మత్స్యకారులకు, ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న నమ్మకాన్ని సియం చంద్రబాబు నిజం చేయనున్నారని తెలిపారు. ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను నిషేధించారు. రెండు నెలల పాటు వేటకు వెళ్లకపోతే మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతుందనే విషయాన్ని అర్థం చేసుకుని, ఎన్నికల ముందే మత్స్యకార కు టుంబాలకు సాయం చేస్తున్నారన్నారు.



1,30,000 కుటుంబాలకు లబ్ది

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.273 కోట్ల రూపాయలతో 1,30,000 మత్స్యకార కుటుంబాలకు ఒక్క కుటుంబానికి రూ 20 వేలుచొప్పున లబ్ధి చేకూర్చిందని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లి లోనే పార్టీ కార్యాలయంలో మత్స్యకార కుటుంబాలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు మత్స్యకారులకు ఇచ్చిన హామీ ప్రభుత్వం నెరవేర్చడంతో సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపి నాయకులు మత్స్యకారులు నాయకులు ఒలేటి రాము, సైకం నీలిమాదేవి, కొక్కిలిగడ్డ ప్రభావతి, కొక్కిలిగడ్డ సుబ్బారావు, లంకె సూర్యం, సైకం సాంబయ్య, నాగిడి శ్యామ్, సి హెచ్ రాంబాబు, మోకా చంద్రబాబు, గాడి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లిలో నిర్వహిస్తున్న ఉండవల్లి సూపర్ లీగ్ టోర్నమెంట్‌లో రాజేష్ జొన్న సీసీ టీం క్రీడాకారులను ఆదివారం దేవుడు మన్యం గ్రౌండ్‌లో జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్ బాబు, జనసేన నాయకులు, సోషల్ వర్కర్ జొన్న రాజేష్ అభినందించారు. అలాగే టీం సభ్యులకు టీ షర్ట్స్ అందచేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లాల్ చంద్, ప్రకాష్ నగర్ వార్డు అధ్యక్షుడు జీలగ కళ్యాణ, విజయ , పసుపులేటి నరేష్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రాతూరులో ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

పేద ప్రజలకు సేవ చేయడంలో జనసేన పార్టీ ముందుంటుందని ఆపార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉదయం ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామ సచివాలయం వద్ద, జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు స్ఫూర్తితో రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త సహకారంతో, జనసేన నాయకులు ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపును జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, జనసేన మంగళగిరి నియోజకవర్గ నాయకులు జన్న రాజేష్, తెలుగుదేశం గ్రామ సీనియర్ నాయకులు పాటిబండ్ల. వెంకటేశ్వరరావు, టిడిపి బీసీ సెల్ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి దావులూరి శ్రీనివాసరావు, తెలుగు యువత మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి సంకురు నాని, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు సంకురు విజయ సాగర్, జనసేన గ్రామ ఉపాధ్యక్షులు యాదల అభిషేక్, గ్రామ కార్యదర్శి కళ్యాణం చంద్రశేఖర్, రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, టిడిపి జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు డైట్ ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - తెనాలిరూరల్



రోగులకు డైట్ ఆహారం పంపిణి చేస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి, ఆర్ఎంఓ డాక్టర్ మల్లికార్జునరావు

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరఫరా చేసే డైట్ ఆహారం పంపిణి కార్యక్రమం తెనాలి జిల్లా వైద్యశాలలో ఆదివారం ప్రారంభించారు. డైట్ టెండరు దక్కించుకున్న గుత్తేదారులు కె.రవికుమార్, డిఎస్ నాయుడు ఆసుపత్రి సూపరింటెండెంట్ టి సౌభాగ్యవాణి చేతులమీదుగా రోగులకు ఆహారం పంపిణి చేశారు. డాక్టర్ సౌభాగ్యవాణి విలేకరులతో మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ డైట్ మేనేజ్మెంట్ కమిటి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డైట్ ప్రతిపాదనను ఒంగోలుకు చెందిన శ్రీ వెంకటేశ్వర అసోసియేషన్ దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. విమర్శలకు తావులేకుండా రోగులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని ఆకాంక్షించారు. కాంట్రాక్టర్ కె రవికుమార్ మాట్లాడుతూ పరిశుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ రోగులను త్వరగా కొలుకునేవిధంగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎమ్ఓ డాక్టర్ మల్లికార్జునరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె రాజేశ్వరి, హెడ్ నర్సులు ఎన్.సుజాత, కె.పద్మావతి, డైట్ కాంట్రాక్టర్లు గంగాధర్, డి.మణికంఠరాజు పాల్గొన్నారు.

పునీత జోసెఫ్ చర్చికి గ్రానైట్ అందజేత



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం చినకాకానిలో నూతనంగా నిర్మిస్తున్న పునీత జోసెఫ్ చర్చికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో గ్రానైట్ అందజేశారు. చర్చి ఫ్లోరింగ్‌కు అవసరమైన రూ. 7 లక్షల విలువ చేసే గ్రానైట్‌ను తన సొంత నిధులతో కొనుగోలు చేయించి ఆదివారం స్థానిక నాయకులు ద్వారా చర్చి నిర్వాహకులకు అందజేయించారు. చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. చర్చి ఫాదర్ చిన్నప్పరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా హరిబాబు, ఉపాధ్యక్షులు పలగాని వెంకట నాగబాబు, పొన్నెకంటి సాంబశివరావు, నక్కా సాంబశివరావు, చాగర్లమూడి నరేంద్ర, ఆకురాతి సాంబశివరావు, పలగాని గంగాధర్ రావు, బొర్రా కిరణ్ కుమార్, కుక్కమళ్ళ శ్రీనివాసరావు, మల్లవరపు కోటేశ్వరావు, మల్లవరపు చినబాబు, ఈపూరు మరియు దాసు, కొప్పాకల ఓంకార్, కటారి జోజి, పత్తిపాటి బాలయేసు, ఎండూరు సత్యనారాయణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా కరణం ధర్మారావు సంతాప సభ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి లోకల్ ఛానల్ హారిక కేబుల్ విజన్ (హెచ్.సి.వి) అధినేత కరణం వెంకటేశ్వరరావు తండ్రి కరణం ధర్మారావు సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఆదివారం రూరల్ గ్రామం కఠెవరం తమ స్వగృహంవద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మేనమామ ఘట్టమనేని రామకృష్ణ పాల్గొన్నారు. ధర్మారావు కుమారులు కరణం చంద్రశేఖర్, గణేష్ యూత్ సభ్యులు వీరవల్లి మురళి, బందులూరి వేణు, చుక్కపల్లి బ్రదర్స్ సాయి, గిరి, రాజకీయ ప్రముఖులు తదితరులు ధర్మారావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. హెచ్.సి.వి సిబ్బంది ఘనమైన నివాళు లర్పించారు.

చదలవాడ సాయి చంద్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించి చదలవాడ సాయిచంద్‌ను సీపీఐ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు.నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చదలవాడ సాయి చంద్‌ను శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు పాల్గొన్నారు.

కెఎల్‌రావు కాలనీలో రక్తదాన శిబిరం



ప్రజాశక్తి- తాడేపల్లి

పట్టణంలోని కేఎల్ రావు కాలనీలో ఆదివారం ఉక్తదాన శిబిరం నిర్వహించారు. 19వ వార్డు జనసేన అధ్యక్షుడు కాశిమాల దినేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన తాడేపల్లి రూరల్ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన నాయకులు జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్ బాబు పాల్గొని రక్తదానం చేసిన వారికీ సర్టిఫికెట్స్ అందచేశారు. కార్యక్రమంలో లాల్ చంద్,కిలాని మణికంఠ, మేకా నాని, గంగవరపు ప్రశాంత్, అల్లం నాగమల్లేశ్వరారావు, కద్దాల ధనుంజయ్, కిలాని శ్రీను, తేజేష్, పండు, శివ, బాలాజీ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు నూతన భవనం అందించనున్న పూర్వ విద్యార్థుల సంఘం

ప్రజాశక్తి - పెదకాకాని

తమకు విద్యాబుద్ధులు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన పాఠశాలకు తమ వంతు సాయం చేస్తున్నామని నంబూరు పూర్వ విద్యార్థుల సంఘం తెలియజేశారు. మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంలో 2022లో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈనెల 30వ తేదీన ప్లాటినం జూబ్లీ భావన ప్రారంభోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాలొననున్నారని ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని తెలియజేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు సర్వారెడ్డి అధ్యక్షులు ప్రతాపరెడ్డి కోశాధికారి కుర్ర కఅష్ణ మాణిక్యరావు నంబూరు నాగేశ్వరరావు లంకపల్లి నాగరాజు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని రూరల్ గ్రామం బుర్రిపాలెం ఎస్ భవన్ లో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ డి శారద ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అల్పాహారం అందించి, షుగర్, బిపి, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలిచ్చారు. షుగర్ వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన ఆహార నియమాలు, శారీరిక వ్యాయామం, క్రమం తప్పకుండా మందుల వాడకం వంటి అంశాలపై వారికి వివరించారు. స్త్రీలకు సంబంధించిన రుగ్మతలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కన్వీనర్ శ్రీనివాస్, 20 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో ఆదివారం సమగ్ర హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి అనుహస్పందన వచ్చింది. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు డా.వాసుబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ రోజుల్లో ఎక్కువమంది గుండె,నరలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారని మొదటి దశలో వాటిని గుర్తిస్తే మరిన్ని రోగాలు బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. డాక్టర్ జాన్ షాహిద్ మాట్లాడుతూ సమగ్ర ఆసుపత్రిలో పేదలకు రాయితీపై వైద్య సేవలు అందిస్తామన్నారు. బిపి షుగర్ థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు ఇతర రోగాల భారిన పడే అవకాశం ఉందని డాక్టర్ బి. సాంబశివరావు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

రేపటి నుండి యథావిధిగా ఎఎన్‌యు పీజీ పరీక్షలు

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫేక్ సర్క్యులర్‌ను విశ్వసించకండి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యధావిధిగా ఈనెల 29 తేదీ నుండి జరుగుతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ ఆదివారం స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ తేదీలలో ఎలాంటి మార్పు లేదనీ ఎట్టి పరిస్థితులలోనూ ఈనెల 29 మంగళవారం నుంచే ఎఎన్‌యు పీజీ 4 వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 29 వ తేదీన జరగబోతున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని, ఇప్పటికే పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల కు కావలసిన అన్ని సదుపాయాలను సమకూర్చామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే వర్సిటీ అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాలలో, పలు సోషల్ మీడియా వేదికలపై "పరీక్షలు జూన్ 10వ తేదీ నుండి ప్రారంభమవుతాయి" అనే తప్పుడు ప్రకటన ప్రచారంలోకి వచ్చిందని, అలాంటి అసత్య సర్క్యులర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై తప్పుడు సమాచారం అందిస్తున్న వారిపై వర్సిటీ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నేటి నుండి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-గుంటూరు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించనున్న వేసవి విజ్ఞాన తరగతుల బ్రోచర్‌ను జిల్లా సంయుక్త కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి ఎ.భార్గవ్‌తేజ ఆదివారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 40 రోజులపాటు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకూ నిర్వహించనున్న ఈవేసవి విజ్ఞాన తరగతులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథపాలకులు కె.ఝాన్సీలక్ష్మి, లైబ్రేరియన్ ఎన్.నాగిరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులతో ఉద్యోగావకాశాలు పుష్కలం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో ఆదివారం ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ రకాల కోర్సుల గురించి 2025 జనవరి భాగంలో ప్రవేశించిన విద్యార్థులకు ఇండెక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇగ్నో స్టడీసెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.వి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే లక్ష్యం కలిగి ఉన్న వారు ఎవరైనా ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ద్వారా వారి కోరిక నెరవేర్చుకోవచ్చని అన్నారు. ఇగ్నో వంటి ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలో చదవడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఇగ్నో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇగ్నో యూనివర్సిటీ అందించే మెటీరియల్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా నెట్‌లో కూడా పొందుపరచి ఉంటుం దన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్ కామేశ్వరశాస్త్రి విద్యార్థులు చేయాల్సిన ప్రాజెక్ట్ వర్క్ గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కౌన్సిలర్ డాక్టర్ యం.యస్ నారాయణ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు డాక్టర్ పి.దేవేంద్రగుప్త, యం మార్కండేయులు, ఇగ్నో సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాల సరఫరా బస్‌ను ప్రారంభిస్తున్న డిఇఒ, ఇతర అధికారులు

మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి-గుంటూరు

వచ్చే విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రం నుండి మండలాలకు చేర్చే కార్యక్రమం ప్రారంభం అయ్యింది. జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక ఆదివారం పాఠ్యపుస్తకాలను మండలాలకు చేర్చే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి పాఠ్యపుస్తకాలు విద్యార్థులందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగా నేడు జిల్లా కేంద్రంనుండి మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. మొదటి సెమిస్టర్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాకు రావాల్సిన ఇండెంట్ 13 లక్షల 24 వేల 446 పుస్తకాలకుగాను ఇప్పటి వరకూ సుమారు 7 లక్షల 50 వేల ఐదు వందల 25 పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. మే 15వ తేదీలోగా అన్ని మండల కేంద్రాలకూ ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు సరఫరాకు కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ వి.వజ్రబాబు, మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డి.ఐ ఎం.డి. ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీ అభ్యర్థుల అభ్యంతరాలను పరిష్కరించాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న రామన్న

ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీలో అభ్యర్థులు తెలుపుతున్న వయోపరిమితి పెంపు, పరీక్షకు 90 రోజుల గడువు, ఒక జిల్లాకు ఒకే పపర్ వంటి అభ్యంతరాలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న కోరారు.ఆదివారం బ్రాడిపేటలోని సంఘ కార్యాలయంలో జరిగిన డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో జి.రామన్న మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఒక్క డిఎస్సీ నోటిఫికేషన్ లేకపోవటంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వారు వయోపరిమితి దాటిపోయారని, కావున 47 సంవత్సరాలకు పెంచాలనే సహేతుకమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రధానంగా పరీక్షకు సిద్ధం అవటానికి 46 రోజుల సమయం సరిపోదని, కనీసం 90 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. డిగ్రీలో అర్హత 40శాతంగా, ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండాలనే అభ్యంతరాలను ప్రభుత్వం పరిష్కరించాలని అభ్యర్థులు కోరుతున్నారన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ డిఎస్సీ గురించి పలు సార్లు ప్రస్తావిస్తూ ఎటువంటి వివాధాలకు తావులేకుండా నోటిఫికేషన్ ఇస్తామని చెబుతూ వచ్చారని, కానీ అచరణలో లక్షలాది మంది అభ్యర్థులను పరీక్షకు దూరం చేసే విధి విధానాలు రూపొందించారన్నారు. ఎప్పుడూ లేని విధంగా డిగ్రీలో మార్కుల విధానం తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు చెబుతున్న అభ్యంతరాలపై ప్రభుత్వం మాట్లాడనే లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ స్పందించి అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా అభ్యర్థుల పోరాట ఫలితంగానే నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. నోటిఫికేషన్ వచ్చాక కూడా ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చదువుకున్న అభ్యర్థులకు న్యాయం చేసేవిధంగా వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పి.భార్గవ్, పి.బాషా, ఎమ్.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్‌ను వీక్షిస్తున్న నాయకులు, వర్సిటీ సిబ్బంది



తలపడుతున్న క్రికెట్ టీంల జట్లు



పోటీని ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

విజయవంతంగా ముగిసిన సిఐటియు మేడే క్రీడా పోటీలు

విన్నర్స్‌గా శ్రీకాంత్11 టీం - రన్నర్స్‌గా ఎపిఎంఎస్‌యు టీం

ప్రజాశక్తి - ఎఎన్‌యు :సిఐటియు గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విజయవంతంగా ముగిశాయి. మేడే సందర్భంగా గత మూడు రోజులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆటలను సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం సాధిం చడంలో ముఖ్య ఉద్దేశం ఎనిమిది గంటల పని, 8 గంటల విశ్రాంతి, ఎనిమిది గంటలు సాంస్కృతిక ప్రజా జీవితంలో ఆటపాటలతో కుటుంబంతో గడపటం ముఖ్య ఉద్దేశమని దాని సాధన కోసం పోరాడి ఎనిమిది గంటల పని విధానం సాధన కోసం అనేకమంది త్యాగాలతో నిర్మించిందే మేడే అన్నారు. మే డే సందర్భంగా సాంస్కృతిక క్రీడా పోటీలను నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. పాల్గొన్న క్రీడాకారులందరినీ అభినందించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న మేడే క్రీడోత్సవాలలో భాగంగా జరిగిన క్రికెట్ పోటీలలో విన్నర్స్ టీం శ్రీకాంత్ 11 టీమ్ నిలవగా రన్నర్స్ టీం గా ఎపిఎంఎస్ఆర్‌యు గుంటూరు టీం లు నిలిచాయి. గెలుపొందిన విజేతలకు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వీరికి బహుమతి ప్రదానం మేడే రోజు అందజేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి లక్ష్మణరావు, నగర ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు, ఏపీ ఎంఎస్ ఆర్ యు రాష్ట్ర కమిటీ మెంబర్ అబ్దుల్ సలీం, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, యూనివర్సిటీ ఉద్యోగు సంఘ నాయకులు కె భాను ప్రసాద్, సిహెచ్ గోపాలకృష్ణ, ప్రసాద్, రమణ, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కె రూఫస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్‌కు ముగిసిన ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు



ఎంపికలలో పాల్గొన్న క్రీడాకారులు

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్లీ ఏబుల్డ్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ముగిసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు తెలిపారు. స్థానిక గుంటూరు పిచ్చుకులగుంట గ్రౌండ్ నెట్స్‌లో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమానికి ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులు సకలాంగులతో పోటీ పడటం గర్వించతగ్గ విషయమని. వీళ్ళని ప్రోత్సహిస్తున్న ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్‌కి కతజ్ఞతలు తెలియచేశారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని క్రికెట్ క్రీడలో అభివృద్ధి సాధించి ఎసిఎకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సెంట్రల్ జోన్ కన్వీనర్ వేల్పుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులు పట్టుదలతో క్రికెట్ ఆడటం వారి ఆత్మస్థైర్యానికి నిదర్శనం అని అన్నారు. ఈ సెక్షన్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారని లీలాకష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా సెలక్షన్స్‌కి సహకరించిన జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి సుధాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ సంఘం జాయింట్ సెక్రటరీ గండా కైలాష్‌రెడ్డి, ఆంధ్రా డెఫ్ క్రికెట్ సంఘ కార్యదర్శి రఘురాజ్, జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం సహాకార్యదర్శి షేక్.నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారిణి జి.కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు జిల్లాలో అటవీ రోడ్డు మార్గాలు ఉన్న వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట రేంజ్ పరిధిలో వన్య ప్రాణుల అక్రమ రవాణా అరికట్టేందుకు ఆయా మార్గాల గుండా వచ్చే వాహనాలను ఫారెస్ట్ రేంజ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. తెల్లవారు జామున 1 గంట నుండి ఉదయం 6 గంటల వరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వినుకొండ , బొల్లాపల్లి, కారంపూడి, దుర్గి, మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, పాపాయపాలెం, నకరికల్లు, అచ్చంపేట ప్రాంతాలలో నాకాబంది నిర్వహించారు. వన్య ప్రాణులను వేటాడినా, చంపినా , అటవీ ఉత్పత్తులను అక్రమంగా రవాణా చేసిన ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. తనిఖీలలో నరసరావుపేట, వినుకొండ,మాచర్ల, పిడుగురాళ్ల రేంజ్ అధికారులు డి.వెంకటరమణ, సిహెచ్.మాధవరావు, విజయలక్ష్మి, విజయ్ కుమారి లు సిబ్బంది పాల్గొన్నారు.